# ఓ రెడ్డి కథ

"డాడి! దిసీజ్ మిస్టర్ ప్రేమ్‌కుమార్. మా కాలేజీలో బోటనీ లెక్చరర్. ఈయనంటే మా కాలేజీలోని విద్యార్థినీ విద్యార్థులందరికీ ఎంతో ఇష్టం...!"

"అంటే నువ్వనేది, ఇతనెంతో పాపులర్ లెక్చరర్ అనే కదా!"

"అవును డాడీ! దాదాపు మిగతా లెక్చరర్లనీ, ప్రొఫెసర్స్‌నీ చూడటానికే స్టూడెంట్స్ ఇష్టపడరు. కానీ, ఈయన మాత్రం విద్యార్థుల్లో ఒకడై కలిసిమెలిసి తిరుగుతుంటారు. కరక్టే కదా సార్!"

కృష్ణారెడ్డికి, అతని కూతురికి జరుగుతున్న ఈ సంభాషణ మధ్యలో తలదూర్చక తప్పలేదు, ప్రేమ్‌కుమార్‌కి.

"నాలుగైదు సంవత్సరాల క్రిందట నేనూ ఒక స్టూడెంట్‌నే కదా! అదీ కాక మీలో నా వయసువాళ్ళూ కొంతమంది ఉన్నారు.'

"నిజానికి మిమ్మల్ని చూసి లెక్చరర్ అని ఎవరూ అనుకోరు. మాలో ఒకరిగానే భావిస్తారు". అని లతికా రెడ్డి తన కళ్లను పాస్‌పోర్ట్‌సైజునుంచి కాబినెట్‌సైజు వరకూ పెంచి తన ప్రశంసలు తెలియజేసింది.

ఈ విధంగా కృష్ణారెడ్డి బంగ్లా ముందున్న పూలతోటలో కూర్చొని వాళ్ళు ముగ్గురూ కొంతసేపు నవ్వుతూ, సరదాగా సంభాషణలు సాగించారు. ఈ లోగా తెల్లని యూనిఫామ్ తెల్లని చేతి గొడుగులు ధరించిన ఒక సర్వెంట్ టీ, కాఫీ, పాలు విడివిడిగా, రెండు మూడు ప్లేట్లలో రకరకాల బిస్కెట్లు వాళ్లముందు తెచ్చి పెట్టాడు. ప్రేమ్‌కుమార్‌కి కాఫీ ఇష్టం కాబట్టి, అది మాత్రమే తీసుకున్నాడు. లతిక బలవంతం చేయడం వలన అతను రెండు బిస్కెట్లు కూడా తినాల్సి వచ్చింది. ఆమె కూడా రెండు, మూడు బిస్కెట్లు సుతారంగా తింది. కృష్ణారెడ్డికి మధుమేహం, రక్తపుపోటు వంటి రోగాలు పుష్కలంగా ఉండటం వలన ఆయన పాలూ, పంచదార కలపకుండా కృష్ణతేనీరు మాత్రమే తాగుతారు. ఆ నల్లటి టీ కొద్దిగానే గొంతులోకి దిగింది కానీ, గొంతులో నుండి పైకొచ్చింది మాత్రం ఆ లెక్చరర్‌ని ఉద్దేశించి చేసిన ఆరోగ్య సంబంధమైన ఒక పొడుగాటి లెక్చర్.

కృష్ణారెడ్డి ఒక పేరుమోసిన కంట్రాక్టర్. ధనిక కుటుంబంలో పుట్టిన కృష్ణారెడ్డి, దేశంలోని

పలు రాష్ట్రాలలో కంట్రాక్టులు తీసుకొని, ఆదాయపు పన్ను శాఖవారి ఊహలకు అతీతమైన శ్రేణిలో ధనార్జన చేశారు. అంత గొప్ప ధనికుడైనా కానీ, ఏ కార్యానికైనా ఆర్థిక సహాయత అంటే ఆమడదూరంలో ఉండేవాడు. అందుకే, ఆయన స్నేహితులందరూ ఆయన్ని యాదురాజ్య ఆర్థిక మంత్రి అని ముద్దుగా పిలిచేవారు. సంతానం విషయంలో కూడా ఆయన పిసినారే. ఆయనకి ఇద్దరే పిల్లలు... పిల్లలా! పెద్దవాడు ఇంజనీరింగ్, ఎమ్.బి.ఎ. పూర్తిచేసి అమెరికాలోని ఒక పెద్ద కంపెనీలో, మాంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. అతనికి తల్లి, తండ్రీ పెట్టిన పేరు లక్ష్మారెడ్డి. కానీ, కాలేజీ రోజుల్లో అతను పెట్టుకున్న పేరు ఆర్.కె. లక్ష్మణ్‌రెడ్డి. పాస్‌పోర్టులో కూడా అలాగే రాశారు కానీ, తన విజిటింగ్ కార్డులో అతను ఆర్.కె. లక్ష్మణ్ అనే ముద్రించి పెట్టుకున్నాడు. అమెరికాలో చాలామంది ఆశ్చర్యంగా "మీరేనా ఇండియాలో ప్రసిద్ధిచెందిన ఆ కార్టూనిస్టు" అని అడిగినప్పుడు ఒక చిరునవ్వు కానీ, నవ్వు కానీ, అట్టహాసం కానీ సందర్భానుసారంగా చెయ్యడంలో అతను ఒక సుఖం పొందేవాడు. ఎన్నో ధనిక కుటుంబాల నుంచి అతనికి పెళ్ళి సంబంధాలు వచ్చాయి కానీ, కట్నం రేటులో గణనీయమైన పెరుగుదల గురించి కృష్ణారెడ్డి ఎదురు చూస్తూ వచ్చాడు. మూడుకోట్ల వరకూ బేరసారాలు జరిగాయి కానీ, మూల్యవర్ధన ఐదుకోట్ల వరకూ రాగల అవకాశముందని పూర్ణ విశ్వాసం ఉంచుకున్న ఆ ముసలి వాడికి కనీసం నాలుగైనా రావాలనే పట్టుదల ఉండేది. ప్రస్తుతానికి ఆ కొడుకు అతని పెళ్ళి వ్యవహారాలని మనం మర్చిపోదాం. అతను ఆర్.కె. లక్ష్మణ్‌రెడ్డే అయ్యి ఉంటే సాక్షాత్తూ కృష్ణారెడ్డికి ప్రథమపుత్రుడే అయి ఉంటే, సంవత్సరాల తరబడి ఒక వివాహ యోగానికి తపస్సు చేస్తున్న యవ్వనానికే వీడ్కోలు చెప్పబోతున్న... ఉడుకురక్తంతో కూడిన ఒక పుంలింగవర్గపు మనిషే అయితే, మరింక ఆలస్యం చేయకుండా, ఆ తండ్రి మానవుణ్ణి లెక్క చెయ్యకుండా, ఏ పూర్వసువాసినియో, ఏ వివాహ విముక్తయో, ఏ వివాహ వేటగత్తెయో అయిన తెల్ల దొరసానిని తన ఇంటికి తెచ్చి ప్రతిష్టిస్తాడు. "వివాహకాలే విపరీతబుద్ధి" అని కదా పూర్వకాలం వాత్సాయనుడు చెప్పారు. అయితే, అమెరికాలో ధనమిచ్చి దాసీ కావడానికి సిద్ధమయ్యే పతివ్రతలు చాలా విరాళంగా ఉంటారు. కానీ, మొగుడి నుంచి ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో లెఖ్ఖపెట్టి తీసుకుంటూ, "గురువుగారి తలపై లేదా వారి పొట్టపై" అనే విధంగా వ్యవహరించే తెల్లది కానీ, శాండ్ పేపర్ వర్ణం కలది కానీ, మసాలా అప్పడం టెక్స్చర్‌లో ఉన్నటువంటి చర్మంగల విలాసినులు ఎంతో మంది ఉంటారు. "శుభస్య శీఘ్రం లేక కళ్యాణమస్తు" అనే ఉపదేశం లేదా ఆశీర్వచనం మనం ఇంటర్‌నెట్ ద్వారా పంపించేద్దామా.

సరే, కృష్ణారెడ్డి గారి బంగళాముందు పూలతోటలో కూర్చొని టీ కానీ కాఫీ కానీ తాగుతున్న ఆ ముగ్గురి సంగతీ ఈ లోపల ఏమైందో. వాళ్ళకి చాలా బోరు కొట్టి ఉంటుంది. అందుకే, మనం త్వరగా అక్కడికి వెళదామా!

అయ్యయ్యో! అక్కడ ఇప్పుడు ఇద్దరే ఉన్నారే. తరువాత, ప్రేమ్‌కుమార్, కృష్ణారెడ్డి మాటలధాటికి తట్టుకోలేక కాబోలు, ఎక్కువసేపు అక్కడ ఉండకుండా, అతిథేయులకు "బిర్లా" చెబుతూ అతను తన మారుతిని మారుతివేగంతో నడుపుతూ వెళ్ళిపోయాడు.

"డాడీ! ఈ ప్రేమ్‌కుమార్ ఎవరో తెలుసా? గొప్ప పేరు ప్రతిష్ఠలున్న ఒక సంపన్న కుటుంబానికి ఏకైక వారసుడు ఇతను జస్టిస్ భీమస్వామి గారి సుపుత్రుడు" అని లతికారెడ్డి, తండ్రికి ప్రేమ్‌కుమార్ చిరునామా గురించి ఒక సంక్షిప్త వివరణ ఇచ్చింది.

"భీమస్వామి గురించి ఎవరికి తెలియదు? కానీ, కొంతమంది అంటున్నట్టు ఆయన అంత లంచగొండి అనుకోవటం లేదు," కృష్ణారెడ్డి ప్రతిస్పందన.

"డాడీ! వారికి తప్పుడు మార్గాల్లో డబ్బు సంపాదించాల్సిన అవసరం లేనే లేదు. ఆయన ఒక గొప్ప కుటుంబంలో జన్మించాడు. ఆకాలంలో ఇంగ్లాండు వెళ్ళి బార్-ఎట్-లా చేయడానికి ఎంతమందికి స్తోమతుంటుంది? పేరు మోసిన వకీలుగా ఆయనెంత సంపాదించారో! ఎన్నెన్ని సెన్సేషన్ కేసులు చేపట్టారో? ఇవాళ హైకోర్టు జడ్జిగా ఆయనకి మంచి పేరుంది. బల్లకింద చేయి పెట్టాల్సిన అవసరం ఆయనకి లేదు. నాలుగైదుతరాల వరకూ చింత లేకుండా జీవించగలిగేటంత ఆస్తి వాళ్ళకుంది. దానికంతటికీ వారసుడు ప్రేమ్‌కుమారే."

"ఆపమ్మా! ఆపు. ఆ కుటుంబానికి భట్రాజు పొగడ్తల గుత్తాధికారం తీసుకునే దౌర్భాగ్యం నీకెలా పట్టింది? దీని గురించి ఆ ప్రేమ్‌కుమార్ నీకేదయినా కమీషన్ ఇస్తున్నాడా? కొంత సేపటి క్రితమే నా ముందు నువ్వు అతన్ని పొగిడావు ఇప్పుడు అతని తండ్రిని పొగుడుతున్నావు. ఇప్పటి వరకూ ఎవరి గురించి నువ్విలా మాట్లాడలేదే! నీలో ఇంతమార్పు రావడానికి కారణమేమై ఉంటుంది? ఏం జరిగింది?"

"ఏం జరగలేదు, డాడీ, కానీ... కానీ"

"ఏమిటీ ఈ కానీ, కానీ? ఏదయినా సరే, సంకోచం వద్దు, చెప్పేయ్."

"డాడీ, .. అదీ... మరీ.. మరీ.."

"ఓహో! "కానీ" పోయి "మరి" వచ్చిందా! విషయమేమైనా చెప్పమని చెప్పానా?"

"డాడీ! వారు నాతో ప్రపోజ్ చేశారు..."

"ప్రపోజా? ఏంటమ్మా నువ్వనేది? నిన్ను పెళ్ళాడాలనే కోరిక ఉందని చెప్పడానికి

అతనికెన్ని గుండెలు! మరో వందజన్మలెత్తినా కానీ, అతనికి అలాంటి అర్హత కలుగుతుందా? అలా అడిగినప్పుడు అతని చెంపలు చెళ్లుమనిపించాలని నీకనిపించలేదు... నా కూతురువై ఉండి."

"కానీ, డాడీ! వారు మర్యాద మీరి ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రవర్తించలేదు. ప్రపోజ్ చేయడం కూడా ఎంతో డీసెంట్‌గా చేశారు. నా అభిప్రాయామడిగారు, అంతే."

"నీతో అలా మాట్లాడేంత ఎత్తుకెదిగాడా?"

"డాడీ! వారు నా కాలేజీలో ఒక లెక్చరర్ కదా! వివాహ విషయమై నా అభిప్రాయం తెలుసుకోవడానికి ఆయనకి ఇంతకన్నా ఎత్తేమయినా కావాలా?"

"నన్నే సవాలు చేసేటంత పెద్దదానివయ్యావా? ఒక్క విషయం మాత్రం స్పష్టం చేస్తున్నాను. నేను రెడ్డిగా పుట్టాను, రెడ్డిగానే జీవిస్తాను, రెడ్డిగానే ఛస్తాను. నా ఇద్దరే ఇద్దరు పిల్లలకి కూడా నేను అలాంటి జీవితమే ఆశిస్తున్నాను. ఈ కుటుంబంలో ఎక్కడినుంచో కలుపుమొక్క వచ్చి పెరగడాన్ని అనుమతించను."

"నీ వాగుడు కట్టిపెట్టు. అది నా దగ్గర కాదు, తాతకి దగ్గులు నేర్పడానికి ప్రయత్నించకు. ఈ జాతిమత భేదాలు వద్దని చెప్పే నాయకులు వాళ్ళ పిల్లల విషయానికి వచ్చేసరికి వాళ్ళ అభిప్రాయం ఎలా వుంటుందో చూడు. ఈ రోజుల్లో అంటరానితనం లేదనే అనుకో. కానీ, అస్పృశ్యులుగా ఇది వరకు భావించిన కొన్ని కులాల్లో వాళ్ళల్లో వాళ్ళకే అది ఈ నాటికీ నిలిచి ఉందే. ఒక కులంవాడి ఇంటినుంచి మరో కులం వాడు గుక్కెడు నీళ్ళయినా తాగడు. ప్రజల్ని ప్రజలే దోచుకు తినకూడదు, వాళ్ళమధ్య సమానత్వం ఉండాలని గొంతు చించుకుని అరిచే కమ్యూనిస్టులున్నారు కదా! వాళ్ళ పిల్లలైతే మాత్రం ఆమెరికా యూనివర్సిటీల్లో చదువుకుంటారు. వాళ్ళు చెప్పేదొకటి, చేసేదొకటి. నేనలాంటివాడిని కాదు, నేనొక పాతకాలపు వాడినని ఒప్పుకొంటాను. అంత అధునాతనంగా మారడం నాకిష్టం లేదు. నా కూతురు మాత్రం కులాంతర వివాహం చేసుకోవడానికి వీల్లేదు."

"డాడీ! ప్రేమ్‌కుమార్ అన్ని విధాలుగా ఉన్నతుడే కాక బాగా డబ్బున్నవాడు కూడా."

"లతికా! ఈ ఇంటికి మరొకడు వస్తే అతను తెచ్చే డబ్బుతోనే నువ్వు బతకాల్సిన దుస్థితి మన కుటుంబానికుందా? నువ్వూ, నీ పిల్లలూ వాళ్ళ పిల్లలూ పైసా సంపాదించకుండా కూర్చుని ఎంత తిన్నా తరగని ఆస్థి ఆ దేవుడి సహాయంతో నేను సమకూర్చిపెట్టాను."

"అంటే, ఈ ఇంటికి అల్లుడిగా వచ్చే వాడి ఆర్థిక స్తోమత అప్రధానమనా మీ ఉద్దేశం?"

"బిచ్చగాడెవడో వచ్చి ఉండటానికి ఈ ఇల్లు ధర్మసత్రమేమీ కాదు, కానీ, చిత్తుగా డబ్బున్న ఇతర కులం వాడి కంటే, ఓ చిన్న రెడ్డి అయినా నా అల్లుడిగా ఫర్వాలేదు. నా ఇష్టానికి విరుద్ధంగా ఈ ఇంట్లో ఏదీ జరగడానికి వీల్లేదు. పరువు నిలబెట్టుకోవడానికి చావడానికైనా, చంపడానికైనా సిద్ధపడేవాడే రెడ్డి. అందుకే, ప్రేమ్‌కుమార్‌ని పెళ్ళి చేసుకునే తీరాలనే పట్టుదలే నీకుంటే, అసలైన రెడ్లమ్మాయిలా నువ్వు ఆత్మహత్య చేసుకో. లేకపోతే మిమ్మల్నిద్దరినీ నేను చంపుతాను. ఈ విషయమై ఇక చర్చ అనవసరం."

"సరే డాడీ! నేను ప్రేమ్‌కుమార్‌కి నచ్చచెబుతాను. ఆయనకొక మంచి అమ్మాయి దొరకటం ఏమంత కష్టం కాదు. అయితే, ఇక నా నిర్ణయం కూడా వినండి. మన కుటుంబ పరువు ప్రతిష్టకు సరితూగని అన్యకులస్తుడిని నేను పెళ్ళాడను. కానీ, నాకు నచ్చని రెడ్డితో బలవంతపు పెళ్ళికి కూడా నేనొప్పుకోను. మీరలాంటి ప్రయత్నం చేసినప్పుడు, ముందు మీరన్నట్టు ఒక రెడ్లపిల్లగా ఆత్మహత్య చేసుకుంటాను."

"అటువంటి పనేదీ నేను చెయ్యను. నీ ఇష్టమే నా ఇష్టం... అతను రెడ్లబ్బాయి అయితే..."

అప్పటికి ఆ సంభాషణా, ఆసంవాదం అలా ముగిశాయి.

ఆరు నెలల తరువాత లతికారెడ్డి, జయశంకర్‌రెడ్డిల వివాహం ఎంతో ఘనంగా జరిగింది.

అది లతిక సంపూర్ణ సమ్మతితో జరిగిందా?

అవునండీ, అవును.

ప్రేమ్‌కుమార్‌ని ప్రేమించి, అతన్ని గాలికొదిలేసి, జయశంకర్ అనే ఒక అబ్బాయిని కేవలం రెడ్డి అనే క్వాలిఫికేషన్ వల్ల పెళ్ళాడటం సబబే అంటారా?

జయశంకర్ కూడా లతికా కాలేజీలో ఒక లెక్చరర్. అతని తండ్రి ఐదూ, పది ఎకరాలున్న ఒక మామూలు రైతు. ఆర్థికంగా పెద్ద కుటుంబం కాదు కానీ, తెల్లటి బొర్ర మీసాలున్న అతను, తన గ్రామానికి సర్వాంగీకృతుడైన సర్పంచ్. అబ్బాయి పెళ్ళి విషయం గురించి, అతనే కృష్ణారెడ్డి దగ్గరికి వచ్చి మాట్లాడాడు. కృష్ణారెడ్డి మొదట ఆ తండ్రీకొడుకులని అవజ్ఞాపూర్వకంగా వీక్షించాడు కానీ, లతికా జయశంకర్ పరస్పరం ఇష్టపడ్డారని తెలియగానే కూతుర్ని పిలిచి, ఆ విషయం రూఢిచేసుకుని, పెళ్ళికి ఒప్పుకున్నాడు.

పెళ్ళి ఏర్పాట్లలోను, పెళ్ళినాటి సందట్లో, పందిట్లో ప్రేమ్‌కుమార్ చురుగ్గా పనిచేయడం

చూసి కృష్ణారెడ్డికి ఆశ్చర్యం వేసింది. ప్రేమ్‌కుమార్, జయశంకర్‌కి ఆప్తమిత్రుడని తెలియడంతో, అతని ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది.

వివాహానంతరం, అత్తగారింటికి వెళ్ళి తిరిగి వచ్చిన లతికా రెడ్డితో తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"డాడీ! ఇప్పుడు నేను మీతో ధైర్యంగా నిజం చెప్పొచ్చు కదా! ప్రేమ్‌కుమార్ నాకు ఎప్పుడూ ప్రపోజ్ చెయ్యలేదు. అతను జయశంకర్‌కి ప్రాణమిత్రుడు. జయశంకర్ కుటుంబ ఆర్థిక స్తోమత మీకు నచ్చే స్థాయిలో లేదని భయపడి, నేనూ, ప్రేమ్‌కుమార్ కలిసి ఈ నాటకం ఆడాం. సారీ డాడీ! మిమ్మల్ని ఆటపట్టించానని అనుకోవద్దు. ఏదయినా కానీ, మీ అమ్మాయి ప్రేమించడానికి ఎన్నుకొన్నది ఒక రెడ్లబ్బాయినే కదా!"

పెళ్ళి కాబోయే అమ్మాయిలూ! ఈ చిట్కా మీకు నచ్చిందా? మీకు కావాలంటే ఇలాంటి చిట్కాలు బోలెడు! రచయితని దూరశ్రవణ యంత్రంద్వారా సంప్రదించవచ్చు.